THE WORD OF TRUTH

# సత్యవాక్కు

క్రైస్తవ మాసపత్రిక

## రేడియో శ్రీలంక ద్వారా క్రీస్తు సంఘముల

## సువార్త ప్రసారములు

**తెలుగు — SATYA VANI**

ప్రతిరోజు మధ్యాహ్నం 2-30 గం॥లకు

**హిందీ — SATYA SUSAMACHAR**

మంగళవారము<br>గురువారము<br>శుక్రవారము } 9.00 to 9-15 p. m.

శనివారము — 1-45 to 2-00 p. m.

**ఇంగ్లీషు — The Voice of Truth**

ఆదివారము — 9-30 to 9-45 p. m.

మంగళవారము — 9-30 to 9-45 p. m.

**తమిళం — SATYA VAZHI**

మంగళవారము — 5-30 to 5-45 p. m.

గురువారము — 6-45 to 7-00 p. m.

శుక్రవారము — 6-45 to 7-00 p. m.

**మళయాళం — The Voice of Truth**

మంగళవారము — 3-45 to 4-00 p. m.

శుక్రవారము — 3-45 to 4-00 p. m.

---

ఈ కార్యక్రమములను అందరు వినండి. అందరికి విన్పించండి.

తెలుగు, ఇంగ్లీషు భాషలలో లభ్యమగు ఉచిత బైబిలు.

కరస్పాండెన్సు కోర్సు కొరకు ఈ దిగువ చిరునామాకు వ్రాయండి.

**SATYA VANI**

**P. O. Box 80, KAKINADA-533 001**

---

Razan Press, Kakinada.

# సత్యవాక్కు

## క్రైస్తవ మాసపత్రిక

**P. O. Box. 80, KAKINADA-533 001.**

*Editor*
J. C. CHOATE

*Managing Editor*
JOSHUA GOOTAM

Pleading for restoration of pure New Testament Christianity

సంచిక **1** ఆగష్టు **1981** సంపుటి **2**


## సంపాదకీయము

### పురాతన మార్గములు

*( The Old Paths )*

అలనాడెప్పుడో దేవుని ప్రవక్త ఇట్లు చెప్పెను : "యెహోవా ఈలాగు సెలవిచ్చుచున్నాడు. మార్గములలో నిలిచి చూడుడి, పురాతన మార్గములను గూర్చి విచారించుడి, మేలుకలుగు మార్గమేది అనియడిగి అందులో నడుచుకొనుడి, అప్పుడు మీకు నెమ్మది కలుగును. అయితే వారు మేము అందులో నడుచుకొనమని చెప్పుచున్నారు" (యిర్మీయా 6:16). ఈనాడును, ఆనాడును ఉన్న అన్ని కాలములలోను ప్రజలు నడిచినట్టి, ఉపయోగించినట్టి మార్గము లున్నవి. ఒక చోటు నుండి మరొక చోటుకు వెళ్లుట కుపయోగపడు మార్గములు ఇవి. అవి ప్రజలకు తెలిసినట్టివి, అంగీకరింప బడినట్టివి మరియు క్షేమకరమైనట్టివి. అట్లే ఆత్మీయ జీవితములో కూడ దేవుడు తన ప్రజలకిచ్చిన మార్గము లున్నవి. వాటిలో ఆయన ప్రజలు నడుచుకొనవలెనని

ఆయన కోరుచున్నాడు. అవి పురాతనమైనవి, విపులముగా బయలు పరచబడినట్టివి. అవి శ్రేష్ఠమైనవి, క్షేమకరమైనవి. వాటి ననుసరించుట జ్ఞానయుక్తమే కాకుండా వారు ఆ మార్గములలో నడువవలెనని దేవుడు వారిని హెచ్చరించెను. దేవునియొక్క మరియొక ప్రవక్త ఇట్లు చెప్పెను: "అక్కడ దారిగా నున్న రాజమార్గము ఏర్పడును. అది పరిశుద్ధమార్గ మనబడును. అది అపవిత్రులు పోకూడని మార్గము. అది మార్గమున పోవువారికి ఏర్పరచబడును. మూఢులైనను దానిలో నడచుచు త్రోవను తప్పక యుందురు" (యెషయా 35:8). అయితే దేవుని హెచ్చరికను లెక్కచేయక "వారు మేము అందులో నడుచుకొనమని చెప్పుచున్నారు". ఇది ఎంత తెలివితక్కువైన పని! గాని నేటి కాలమునకు ఏమీ భిన్నముగా లేదు.

యేసుక్రీస్తు ఈనాడు మనకు మార్గమై యున్నాడు (యోహాను 14:6). మన మాయన అడుగు జాడలలో నడుచుకొనునట్లు మన కొక మాదిరి యుంచిపోయెను (1 పేతురు 2:21). మనందరము ఏ మార్గములో నడుచుకొందుమో నిశ్చయించుకొనగలుగునట్లు మన ముందు ఆయన ఇరుకు మార్గమును, విశాలమార్గమును ఉంచి యున్నాడు (మత్తయి 7:13, 14). విశాలమైన మార్గము ఒకటి యున్నది. దానిలో అనేకులు నడుతురు. అది నాశనమునకు పోవు మార్గము. రెండవది ఇరుకును, సంకుచితమునై యున్న మార్గము. దానిలో నడుచువారు కొందరే. అది నిత్యజీవితమునకు పోవు మార్గము. నీవు ఏ మార్గములో ప్రయాణించుచున్నావు?

మన కాలమందున్న వారికి దేవు డేర్పరచిన మార్గమునుగూర్చి మరికొంత తెలిసికొందము. అది క్రొత్త నిబంధన పుటలలో స్పష్టముగా బయలుపరచబడిన మార్గము. కొంత సమయమును వెచ్చించి దేవుని గ్రంథమును చదువు ప్రతివాడును దేవుడు కోరుచున్న దేమిటో

ఖచ్చితముగా తెలిసికొన గలడు. మనము గ్రహించి విశ్వసించి లోబడునట్లు దేవుని చిత్తమును మనము తెలిసికొనవలెనని ఆయన కోరుచున్నాడు. ఉదాహరణకు మనము ఆయన వాక్యమును చదువు చున్నప్పుడు మనము రక్షించబడగలునట్లు క్రీస్తు మనకొరకు చనిపోవుట మాత్రమేగాక (రోమా 5:8), మనము రక్షించబడవలనంటే మనము నెరవేర్చవలసిన కొన్ని షరతులను లేక ఆజ్ఞలను ఆయన ఇచ్చినట్లు కనుగొనగలము. "నమ్మి బాప్తిస్మము పొందినవాడు రక్షించబడును; నమ్మనివానికి శిక్ష విధించబడును" అని క్రీస్తుచెప్పెను (మార్కు 16:16). మనము రక్షించబడవలనంటే మన మవలంబించవలసిన మార్గము అది. అది పురాతనమైన మార్గము, నిజమే. కాని అది ప్రభువుమార్గము గనుక వేరొక మార్గమేదియు ఉండనేరదు.

మనము లేఖనములను చదువుచుయుండగా క్రీస్తు సువార్తకు లోబడి రక్షింపబడిన తరువాత ప్రభువు మనలను తన సంఘముతో చేర్చుకొనునని చెప్పబడియున్నది (అపో. కా. 2:47). ఆ సంఘము ఆయన సంఘము, అది ఆయనకు చెందియున్న సంఘము (మత్తయి 16:18; ఎఫెసీ 5:25) దానికి ఆయనే రక్షకుడు (ఎఫెసీ 5:23). మరియు అది ఆయన నామమును ధరించును (రోమా 16:16). మనము ప్రభువు మార్గము ననుసరించునప్పుడు మనము మరి యే సంఘమునకు గాక ఆయన సంఘసభ్యులమగుదుము.

మనము ప్రభువు మార్గము ననుసరించునప్పుడు ఆయనను ప్రతి ఆదివారము ఆరాధించెదము (అపో. కా. 20:7). మిగిలిన క్రైస్తవు లతో సమావేశమై వాక్యపఠనము గావింతుము (2 తిమో 2:15), ప్రార్థనచేతుము (అపో. కా. 2:42), పాటలు పాడుదుము (ఎఫెసీ 5:19), ప్రభు రాత్రిభోజనములో పాలు పొందుదుము. ( I కొరింథీ 11:23-25) మరియు కానుకలిత్తుము. (I కొరింథీ 16:2). అంతే

కాకుండా మనము చేయవలసిన దానినిగూర్చి పలుకవలసిన దానిని గూర్చిన సత్యమార్గమును దేవుని వాక్యము మనకు బయలుపరచు చున్నది. (I పేతురు 4:11). ఇందువలన ఆయా విషయములను గూర్చిన దేవుని చిత్తమేమిటో మనము తెలిసికొనగలుగుటయేగాక ఆయనకు అంగీకారముగాయుండు వాటిని మనము చేయ వీలగును (యాకోబు 1:23).

విచారకరమైన యథార్థత యేమంటే అందరు సత్యమును ప్రేమించుటలేదు. చాలామంది అజ్ఞానములోయుండి సంతృప్తిజెందు చున్నారు. వాళ్ళకు ఏవిధమైన తొందర ఎవరు కలుగజేయకూడదు. మత సంబంధముగా వారేమైయున్నారో వారికే తెలుసు. వారు ఎక్కడ ఉన్నారో అక్కడనే ఉండగోరుదురు. వారియొక్క ఉదాసీనతను బట్టియు విముఖతనుబట్టియు వారు నాశనమగుదురు.

మనము సహృదయత కలిగి మన జీవనమునకు భక్తికి కావలసిన వాటన్నిటిలోను దేవుని చిత్తమును ఎల్లప్పుడు తెలిసికొనుటకు ప్రయత్నించవలెను. సత్యముకంటె ఏదైనా తక్కువైన దానితో మనము సంతృప్తిజెందరాదు. దేవునిమార్గమును తెలిసికొనుట వలననే ఆయన చిత్తమునకు మనము లోబడగలము మరియు పరలోక పట్టణమగు ఆ నూతన యెరూషలేముకుపోయే మార్గమునందు ప్రయాణించగలము

దేవుని వాక్యమునందుంచబడిన పురాతన మార్గములకు మేము వెళ్ళుచుండగా మీరును మాతో కలసి రావలెనని మేము మిమ్ములను ఆహ్వానించుచున్నాము. అట్లుచేయుటలో మీరు మమ్మును వెంబడించుటగాని, మేము మిమ్మును వెంబడించుటగాని జరుగదు. అయితే మనము ప్రభువును వెంబడింతుము. మనమాయన మార్గములందు నడుచుకొందుము, ఆయన మనలను ఏమిచేయవలెనని కోరుచున్నాడో వాటినిచేతుము. మనమేమై యుండవలెనని ఆయన కోరుచున్నాడో

అన్వేషించుదుము. ప్రభువు మార్గమును ఆయన చిత్తమును మనము అడుగుదుము, వేరొకదానితో మనము సంతృప్తిచెందరాదు. మనము క్రీస్తును వెంబడించి, సరియైన మార్గములో యుండలేనియెడల వేరొకని ఎందుకు వెంబడించవలెను? భక్తిపరులముగా యేల ఉండవలెను? తప్పుకానిది, సరియైనది ఒకమార్గమున్నది. అయితే "ఒకని యెదుట సరియైనదిగా కనబడు మార్గము కలదు. అయితే తుదకు అది మరణమునకు త్రోవతీయును" అని జ్ఞాపకముంచుకొనుము (సామెతలు 14:12). ప్రభువు మార్గమే సరియైన మార్గము అని మనసులో నుంచుకొనుము. పరలోకమునకు వెళ్లుమార్గము అదిఒక్కటిమాత్రమే. దీనిలో నడచుకొనువారు, లేదా ప్రయాణించువారు మాత్రమే పరలోకమునకు వెళ్ళ గలరు.

---

## దేవుని రక్షణ మార్గము
## *( God's Way of Salvation )*

"వారందరును దేవునిచేత బోధింపబడుదురు అని ప్రవక్తల లేఖనములలో వ్రాయబడి యున్నది గనుక తండ్రివలన విని నేర్చుకొనిన ప్రతివాడును నా యొద్దకు వచ్చును" అని యేసు చెప్పెను (యోహాను 6:45).

1. యేసు ఏల అవతరించెను ?

   a) "నశించిన దానిని వెదకి రక్షించుటకు మనుష్య కుమారుడు వచ్చెను" (లూకా 19:10).

   b) "గొఱ్ఱెలకు జీవము కలుగుటకును అది సమృద్ధిగా కలుగుటకును నేను వచ్చితినని మీతో నిశ్చయముగా చెప్పుచున్నాను" (యోహాను 10:10).

2. ఎవరు రక్షింపబడ గలరు ?

a) "దేవుడు లోకమును ఎంతో ప్రేమించెను. కాగా ఆయన తన అద్వితీయ కుమారునిగా పుట్టిన వాని యందు విశ్వాస ముంచు ప్రతివాడును నశింపక నిత్యజీవము పొందునట్లు ఆయనను అను గ్రహించెను" (యోహాను 3:16).

b) ఎవరును నశింపవలెనని దేవుడు యిచ్ఛయింపక అందరు మారు మనస్సు పొందవలెనని కోరుచున్నాడు (2 పేతురు 3:9).

3. మన సంపూర్ణ మార్గదర్శి యేది ?

a) "మేము మీకు ప్రకటించిన సువార్తగాక మరియొక సువార్తను మేమైనను పరలోకము నుండి వచ్చిన యొక దూతయైనను మీకు ప్రకటించిన యెడల అతడు శాపగ్రస్తు డవును గాక" (గలతీ 1:8).

b) లేఖనములు దైవజనుని ప్రతి సత్కార్యమునకు సంపూర్ణునిగా చేయును (2 తిమో 3:16, 17).

4. మనము ఎవరిని వినవలెను ?

a) "ఈయన మాట వినుడి" (మత్తయి 17:3-8).

b) క్రీస్తును, ఆయన మాటలను వినవలెను (యోహాను 12:48).

5. దేవుడు మానవులను ఎట్లు పిలుచుచున్నాడు ?

a) తండ్రి మనలను ఆకర్షించవలెను (యోహాను 6:44, 45).

b) ఆయన మనలను సువార్తద్వారా పిలుచుచున్నాడు (2 థెస్స 2 : 14).

6. మనము ఎట్లు రక్షింప బడుదుము ?

a) మనము తిరిగి జన్మించవలెను (యోహాను 3:3).

b) మనము నీటి మూలముగాను ఆత్మ మూలముగాను జన్మించ వలెను (యోహాను 3:5).

7. విధేయత అవసరము :

a) తండ్రిచిత్తము జరిగించువాడే పరలోకరాజ్యములో ప్రవేశించును (మత్తయి 7:21).

(b) "ఆయన కుమారుడై యుండియు తాను పొందిన శ్రమలవలన విధేయతను నేర్చుకొనెను. మరియు ఆయన సంపూర్ణసిద్ధిపొందినవాడై ...తనకు విధేయులైనవారికందరికి నిత్యరక్షణకు కారకుడాయెను" (హెబ్రీ 5:8, 9).

8. విశ్వాసము అవసరము:

(a) "విశ్వాసము లేకుండ దేవునికి ఇష్టుడైయుండుట అసాధ్యము" (హెబ్రీ 11:6).

(b) "నేను ఆయననని మీరు విశ్వసించనియెడల మీరు మీపాపములోనే యుండి చనిపోవుదురని" యేసుచెప్పెను (యోహాను 8:24).

9. మారుమనస్సు అవసరము:

a) మారుమనస్సు పొందుడి లేనా నశించుడి (లూకా 13:3)

b) ఆ అజ్ఞాన కాలములను దేవుడు చూచి చూడనట్టుగా ఉండెను; ఇప్పుడైతే అంతటను అందరును మారుమనస్సు పొందవలెనని మనుష్యులకు ఆజ్ఞాపించుచున్నాడు" (అపొ. కా. 17:30).

10. ఒప్పుకొనుట అవసరము:

(a) రక్షణ కలుగునట్లు నోటితో ఒప్పుకొనవలెను (రోమా 10:10).

(b) క్రీస్తును ఒప్పుకొనువారందరిని ఆయన తండ్రియెదుట ఒప్పుకొనును (మత్తయి 10:32).

11. బాప్తిస్మము అవసరము:

(a) మీరు మారుమనస్సుపొంది పాపక్షమాపణ నిమిత్తము బాప్తిస్మము పొందుడి (అపొ.కా. 2:38).

b) "బాప్తిస్మము ఇప్పుడు మిమ్మును రక్షించుచున్నది" (I పేతురు 3:21).

c) "కనుక నీవు తడవు చేయుట ఎందుకు? లేచి ఆయన నామమునుబట్టి ప్రార్థనచేసి బాప్తిస్మముపొంది నీ పాపములను కడిగివేసికొనుము" (అపొ. కా. 22:16).

12. క్రియలు అవుసరము:

a) "ఆయన పంపినవానియందు మీరు విశ్వాసముంచుటయే దేవుని క్రియ" (యోహా 6:29).

b) "మీసొంత రక్షణను కొనసాగించుకొనుడి" (ఫిలిప్పీ 2:12).

c) మానవుడు క్రియలమూలముగా నీతిమంతుడని తీర్పునొందును (యాకోబు 2:24).

d) క్రియలులేని విశ్వాసము మృతము (యాకోబు 2:20, 26).

13. అప్పుడు నీవే సంఘములో యుందువు?

a) రక్షింపబడుచున్నవారిని అనుదినము ప్రభువు వారితో చేర్చుచుండెను (అపొ.కా. 2:47).

b) యేసు తన సంఘమును నిర్మింతునని వాగ్దానము చేసెను (మత్తయి 16:18).

14. నీవు ఏ నామమును ధరించవలెను?

a) "శిష్యులు మొట్టమొదట అంతియొకయలో క్రైస్తవులనబడిరి" (అపొ. కా. 11:26).

b) "ఎవడైనను క్రైస్తవుడైనందుకు బాధ అనుభవించినయెడల అతడు సిగ్గుపడక, ఆ పేరును బట్టియే దేవుని మహిమ పరచవలెను" (I పేతురు 4:16).

15. సంఘ సభ్యత్వము అవుసరము:

a) క్రీస్తురక్తముచే సంఘము సంపాదించబడెను (అపొ. కా. 20:28).

b) సంఘము క్రీస్తు శరీరమై యున్నది (ఎఫెసీ 1:22, 23).

c) సంఘము దేవుని కుటుంబమై యున్నది (1 తిమో 3:15).

d) రక్షింపబడిన వారిని ప్రభువు దానితో చేర్చును (అపొ॥ కా. 2 : 47).

e) దేవుని వాగ్దానము లన్నియు క్రీస్తునందున్నవి (2 కొరింథీ 11 : 20).

f) ప్రతి ఆత్మీయాశీర్వాదము క్రీస్తునందున్నది (ఎఫెసీ 1:3). క్రీస్తునందుండుట అనగా ఆయన శరీరమై యున్న సంఘములో ఉండుటయే.

16. ఆత్మీయ ఆరాధన ఏది యగును?

a) అది నిజదేవునికి చేయబడవలెను (యోహాను 4:23).

b) అది సత్యవాక్యమును బట్టి, ఆయన అధికారము పొందినట్టిదై యుండవలెను (యోహాను 4:24).

c) అది ఆత్మతో (గ్రహింపుతో) యుండవలెను (యోహాను 4:24)

17. క్రొత్తనిబంధన సంఘముయొక్క పాలన పద్ధతి యెట్లుండును?

a) ప్రతి స్థానిక సంఘములోను పెద్దలు, పరిచారకులు, సభ్యులు ఉందురు (అపొ. కా. 14:23, 1 తిమో 3; తీతు 1).

b) భూసంబంధ ప్రధానకార్యాలయముగాని, శిరస్సుగాని యెవడు లేడు.

18. క్రైస్తవ పెరుగుదల అవసరము:

a) క్రైస్తవ సద్గుణములను పెంపారు చేసుకొనవలెను (2 పేతురు 1:5-11).

b) ప్రభువుకు ఫలములను ఫలించవలెను (యోహాను 15:1-6).

c) మనుష్యులయెదుట మీ వెలుగు ప్రకాశింపనీయుడి (మత్తయి 5:16).

19. పనిచేయుస్థానము సంఘమైయున్నది.

a) అనేక పందెమువలె మనము పరుగెత్తవలెను (హెబ్రీ 12:1).

b) ఒక సైనికునివలె మనము పోరాడవలెను (1 తిమో 6:12).

c) మనము వాక్యమును బట్టి నడుచుకొనువారమై యుండవలెను (యాకోబు 1:22).

d) మనము క్రీస్తు మాదిరి ననుసరించవలెను (యోహాను 9:4).

e) మన క్రియలను బట్టి మనకు తీర్పు తీర్చబడును (ప్రకటన 20 : 12).

f) ఈ లోక తత్వమునకు విరుగుడు, పని.

g) పనిచేయు సంఘము పెనుగులాడు సంఘము కానేరదు.

h) ప్రేమవలన, కార్య సాధకమగు విశ్వాసము వలన మనము రక్షించ బడుదుము (గలతీ 5 : 6). నీకు సమీపముగా యున్న క్రీస్తు సంఘారాధనలకు హాజరు కమ్ము ! !

—W. A. బ్రాడ్‌ఫీల్డ్.

## క్రైస్తవ్యము ఒక మార్గమై యున్నది

హిందూ, బౌద్ధ, ముస్లిం మొదలగు మతములవలెనే క్రైస్తవు లదికూడ ఒక మతము లేక మతశాఖలు అయివున్నవని అనేకులు తలంచుచున్నారు. గాని దైవగ్రంథమందు క్రైస్తవ్యము ఒకమతమని లేక మత శాఖలు అని ఎచ్చటను కనుగొనలేము.

ఒక దినమున రేడియోలో "మతశాఖలన్నియు మంచివే; వాక్యప్రకారము భక్తివిశ్వాసములతో జీవించినచాలు"నని ఒకాయన బోధించెను. క్రైస్తవ్యము మతమే కాకపోతే, మతశాఖలు ఎక్కడివి ?

అపొ. కా. 17:10-11లో, అపొస్తలుడైన పౌలు సీలలు అను గొప్ప బోధకులు బెరయపట్టణమునకువచ్చి సువార్తను బోధించగా బెరెయలోని క్రైస్తవులు, వారు బోధించిన సంగతులు అలాగున్నవో లేవో అని ప్రతిదినము లేఖనములను పరిశోధించుచువచ్చిరి. వీరు థెస్సలొనీకయలో ఉన్నవారికంటె ఘనులై యుండిరని వ్రాయబడి యున్నది. వీరు వారికంటె ఘనులని పిలువబడుటకుగల కారణమేమై యుండునో?

ఎవరేమి బోధించినను, మనముకూడ విని, వారెంతటి పేరు గాంచిన బోధకులైనను వారు బోధించిన సంగతులు అలాగున్నవో లేవో మనముకూడ లేఖనములను పరిశోధించు బాధ్యత కల్గివున్నాము.

మత్త 7:15లో అబద్ధప్రవక్తలనుగూర్చి జాగ్రత పడుడని మన ప్రభువే హెచ్చరించియున్నాడు. 2 పేతురు 2:1లో "మరియు అబద్ధ ప్రవక్తలు ప్రజలలోవుండిరి. అటువలనే మీలోను అబద్ధబోధకులు వుందురని" అపొస్తలుడైన పేతురుకూడ హెచ్చరించుచున్నాడు.

లోకములో అనేక మతములుండవచ్చును గాని క్రైస్తవ్యము మాత్రము ఒక మతముకాదు. మతశాఖలు అసలే కాదు. గాని అదిపర లోకమునకు దేవుడేర్పరచిన మార్గమైయున్నది. మతము అనగా మానవుడు దేవుని యొద్దకు వేసికొన ప్రయత్నించుమార్గము. యిది మానవ ప్రయత్నమే, యిది మానవునికి అసాధ్యమైన కార్యము. గాని దేవుడు లోకమును ఎంతో ప్రేమించి, పాపాత్ములైన మనలను రక్షింప గోరి దాదాపు రెండువేల సంవత్సరముల క్రిందట తన కుమారుడైన యేసుక్రీస్తుద్వారా ఏర్పాటుచేసిన మార్గమైవున్నది. యోహా 14:6లో ప్రభువైన క్రీస్తు "నేనే మార్గమును, సత్యమును, జీవమునై యున్నాను. నాద్వారా తప్ప తండ్రియొద్దకు ఎవడును రాలేడని" పలికెను. నేను ఒకమతమని చెప్పలేదు, మార్గమనెను. యోహా 10:8 లో గొర్రెలు

పోవు ద్వారము నేనే అనెను. ద్వారము అనగా లోపలికి వెళ్లు మార్గమని అర్థము. మార్గమనగా అది ఏకవచనమే గాని బహువచనము మాత్రముకాదు. ఆయనయందు విశ్వసించినవారందరును ఆ ఒకే మార్గములో నడవబద్ధులైయున్నారు.

అ. కా. 9:1-2లో సౌలు యింకను ప్రభువు శిష్యులను బెదిరించుటయును, హత్యచేయుటయును తనకు ప్రాణాధారమైనట్టుగా ప్రధాన యాజకునియొద్దకు వెళ్ళి యీమార్గమందున్న పురుషులనైనను, స్త్రీలనైనను కనుగొనినయెడల వారిని బంధించి యెరూషలేముకు తీసికొనివచ్చుటకు పత్రికలిమ్మని అడిగెను అని వ్రాయబడినదిగాని యీ మతములో వున్న వారిని హింసించెనని వ్రాయబడలేదు.

మతమనుమాటే లేకపోయినయెడల యిక మతశాఖలు ఎక్కడివి? యీమతశాఖలు మానవులు ఏర్పాటుచేసినేగాని, దయగల దేవుడైతే పరలోకమునుండి నరలోకమునకు, నరలోకమునుండి పరలోకమునకు ఒకమార్గమును ఏర్పాటుచేసెను.

అలాగైన రక్షణకలుగు మార్గమేది? అను ప్రశ్న కలుగవచ్చును. క్రీస్తే ఆమార్గమైయున్నాడు.

అ. కా. 4:12లో "మరి ఎవనివలనను రక్షణ కలుగదు. ఈ నామముననే మనము రక్షణ పొందవలెనుగాని ఆకాశముక్రింద మనుష్యులలో యియ్యబడిన మరి ఏనామముననను రక్షణ పొందలేము" అని వ్రాయబడియున్నది. స్నేహితుడా, వాక్యమునువిని, ఆయనయందు విశ్వసించి, మారుమనస్సుపొంది, క్రీస్తు దేవుని కుమారుడని ఒప్పుకొని బాప్తిస్మముపొందుము. అప్పుడు నీవు రక్షింపబడుదువు. ప్రభువే నిన్ను తనసంఘములో చేర్చును.

— బి. లాజరస్.

# మరియను గూర్చిన మాయలు

## *( Myths about Mary )*

యేసు తల్లియైన మరియ ఒక గొప్ప స్త్రీ. ఆమె రాజుల వంశావళి కలిగిన ఒక భక్తిగల యూదురాలు. ఆమె ఇంక కన్యగా యుండగానే పరిశుద్ధాత్మని వలన అద్భుతరీతిగా గర్భమును ధరించి ఈలోక రక్షకునికి జనన మిచ్చెను (మత్తయి 1:18-25). ఒక బాలునిగా యేసు తన తల్లికి లోబడెను. ఆయన పెరిగి పెద్దవాడైనను ఒక పురుషునికి తగిన రీతిగా ఆమెను ప్రేమించి గౌరవించెను (లూకా 2:51; యోహాను 19:26, 27).

మరియను గూర్చి బైబిలు చెప్పిన దంతయు సత్యము. ఆమె ధన్యురాలు, ప్రాముఖ్యమైన ఒక వ్యక్తి (లూకా 1:28-35). అయితే సహృదయులైన కొందరు సంవత్సరములు తరబడి మరియనుగూర్చిన కల్పిత కథలను నమ్ముచువచ్చారు. మరియనుగూర్చి ఆధునికముగా చెప్పబడుచున్న కొన్ని సంగతులు వట్టిమాయలు, హాస్యాజనకములు, అవి నిజానికి దేవదూషణకరమైనవి. వాటిలో ఈదిగువ కొన్నిటిని పరిశీలింతము:

**1. మరియయొక్క శాశ్వత కన్యాత్వము (The Perpetual Virginity of Mary) :** మరియ ఎల్లప్పుడు కన్యగానే యుండెనని కొందరు విశ్వసింతురు. క్రీస్తు జన్మించిన తరువాత ఆమె జీవించిన సంవత్సరములన్నియు ఆమె కన్యగానే యుండెనని వారు భావింతురు. అయితే మరియ యోసేపుయొక్క భార్య ఆయెనని (మత్తయి 1:16, 19-20, 24-25; లూకా 2:41), యేసుకు సహోదరులు, సహోదరీలు ఉన్నట్లు బైబిలు విశదముగా బోధించుచున్నది (మత్తయి 13:55; మార్కు 16:3).

మరియ శాశ్వతముగా కన్యయైయుండెనని వారి స్వాములు బ్రహ్మచర్యము ననుసరించవలెనని ఆజ్ఞాపించుచు వివాహము ఒకని అపవిత్రపరచునని కేథలిక్కు సంఘము ప్రచారము చేయుచున్నది. వివాహము ఘనమైనదని (హెబ్రీ 13:4), క్రీస్తుసంఘములో పెద్దగా లేక అధ్యక్షునిగా యుండగోరువాడు వివాహితుడై యుండవలెనని బైబిలు చెప్పుచున్నది (I తిమోతి 3:1-2), యోసేపుతో తనకు జరిగిన వివాహమును బట్టి మరియ దాంపత్య జీవితమును కొనసాగించుట ఏమి తప్పుకాదు (1 కొరింథీ 7:1-5).

**2. పాపరహితముగా మరియ జన్మించుట (The Immaculate Conception of Mary) :** పసిబిడ్డలు ఆదిమ పాపముతో జన్మింతురను నమ్మకము చొప్పున, కేథలిక్కు సంఘము మరియను గూర్చి ఆందోళన జెందెను. ఏలయనగా వారు మరియను పూజించు చుండిరి, అందువలన 1854వ సంవత్సరములో పోప్ పయస్ IX అను నతడు మరియకు ఆదిమ పాపము లేదని వినాయించుటకు ఆమె పాప రహితముగా జన్మించెనని ప్రకటించెను.

పాపమనునది వారసత్వమువలన వచ్చునది కాదుగాని అది జరిగించుటవలన కలిగెది. "పాపము చేయువాడెవడో వాడే మరణము నొందును. తండ్రియొక్క దోషశిక్షను కుమారుడు మోయుట లేదని కుమారుని దోషశిక్షను తండ్రిమోయడు. నీతిపరుని నీతి ఆ నీతిపరునికే చెందును, దుష్టుని దుష్టత్వము ఆదుష్టునికే చెందును" (యెహెజ్కేలు 18:4, 20).

చిన్నబిడ్డల యొక్క పవిత్రతను, అమాయకత్వమును యేసు బలపరచెను (మత్తయి 18:3-6). అట్టివారిదే పరలోక రాజ్యము అని ఆయన చెప్పెను (మత్తయి 19:14). ఆదాముద్వారా అందరికి మరణము సంప్రాప్తమాయెను అని బైబిలు చెప్పుచున్నది (రోమా 5:12).

మరియు మనుష్యు లొక్కసారే మృతి పొందవలెనని నియమింపబడెను (హెబ్రీ 9:27). అయితే ఒక తరము నుండి మరొక తరమునకు పాపము సంప్రాప్తమగుననిగాని, పసిబిడ్డలు పాపమును వారసత్వముగా పొందుదురనిగాని బైబిలు చెప్పుట లేదు.

అద్భుతరీతిగా మరియ తన తల్లి గర్భములో పడెనని చెప్పు వచనము బైబిలులో ఒక్కటికూడా లేదు. అట్టి సిద్ధాంతమును గూర్చి యేసుగాని ఆయన అపొస్తలులుగాని కించిత్తుకూడ చెప్పలేదు. మరియ మృతి బొందిన కొన్ని వందల సంవత్సరముల తరువాత ఈ అబద్ధ సిద్ధాంతము కనిపెట్టబడెను. అది కేవలము మానవ కల్పితమే.

## 3. మరియకు పాపములేకపోవుట (Sinlessness of Mary):

మరియయొక్క జీవితము పాపరహితమైనదని కేథలిక్కు సంఘము చెప్పుచున్నది. అందరును పాపముచేసి దేవుడనుగ్రహించు మహిమను పొందలేక పోవుచున్నారని బైబిలు బలముగా చెప్పుచున్నది (రోమా 3:23; గలతీ 3:22). ఈనియమమునుండి యేసుక్రీస్తు ఒక్కడు మాత్రమే వినాయించబడిన వాడని బైబిలు చెప్పుచున్నది. (I పేతురు 2:22; 2 కొరింథీ 5:21; హెబ్రీ 4:15). దేవుడు తన రక్షకుడని మరియ పలికెను (లూకా 1:47). ఆమె పాపము లేనిదైతే ఆమెకు రక్షకుడు అవసరములేదు. పాపరహితుడైన క్రీస్తుకు ఒకరక్షకుడవసరమైనట్లు నీవు ఊహించుకోగలవా ?

మరియకు పాపములేదని బోధించుటద్వారా ఆమెను మానవత్వమునుండి దైవత్వస్థాయికి తీసుకొనివచ్చుటకు చేయుచున్న ప్రయత్నమదియని గోచరమగుచున్నది. అయితే మరియ ఒక మానవ మాత్రురాలే. మరియ పాపములేని స్త్రీయని అపొస్తలులలో ఎవడు, కొత్తనిబంధన వ్రాసిన ఆత్మావేశ లేఖకులలో ఎవడు, చివరకు యేసు

క్రీస్తుకూడ ఎన్నడు బోధించలేదు. అయితే మరియను ఆరాధించుటకు మొదలిడిన సంఘము కనిపెట్టిన కట్టుకథ యిది.

4. మరియను ఆరాధించుట (Worship of Mary): దేవుని ఆరాధించు రీతిగా మేము మరియను ఆరాధించుటలేదని కేథలిక్కులు బలముగా వాదింతురు. ఆరాధననుగూర్చిన వివిధనిర్వచనములు అట్లుంచి మరియకు దైవనామము లనేకములు ఈయబడినట్లు సామాన్య మానవు డెవడయినా ఇట్టే గమనించగలడు. ఆమెను దేవుని తల్లియని వారు పిలుతురు. రకరకాల సుఖసౌభాగ్యముల కొరకు వారామెను వేడుకొందురు. ఆమెను మధ్యవర్తియని, ప్రతినిధియని పిలుతురు. బైబిలు ఆమెనుగూర్చి చెప్పుదానికంటె ఆమెను వారు ఎంతో ఎక్కువగా కొనియాడుదురు. ఆమెయొక్క పరిశుద్ధత ఒకగొప్ప ఆశ్చర్యకరమైన సంగతి! (కొత్తనిబంధనప్రకారము క్రైస్తవులందరు పరిశుద్ధులు రోమా 15:26 ; ఫిలిప్పీ 1:1).

మానవుడు దేవుని ఆరాధించవలెనని బైబిలు బోధించుచున్నది (ప్రకటన 19:10; మత్తయి 4:10), ఆమెను కొనియాడే విధముగానైనను మరియను ఆరాధించవలెనని బైబిలు బోధించుటలేదు. క్రీస్తు తన శిష్యులకంటె పైగా ఆయన కుటుంబమును ఉంచుటకు ప్రయత్నించలేదు (మత్తయి 12:46-50). మరియకు చేసే వివిధపూజలు మానవునినుండి కలిగినవే కాని దేవునివలన కలిగినవికావు.

5. మరియ ఒక మధ్యవర్తిగా (Mary as a mediator): కేథలిక్కులు మరియద్వారా ప్రార్థింతురు. దేవునికి మానవునికి ఆమె ఒక మధ్యవర్తి యని వారు నమ్ముదురు. "దేవు డొక్కడే, దేవునికిని నరులకును మధ్యవర్తియు ఒక్కడే; ఆయన క్రీస్తు యేసను నరుడు" అని 1 తిమోతి 2:5 లో అపో. పౌలు చెప్పెను.

మానవులకు దేవునికి వున్న మధ్యవర్తి యేసుక్రీస్తు ఒక్కడే. మరియ ఒక మధ్యవర్తియను చెప్పు బోధ కేవలము కట్టుకథయేగాక అది దేవుని వాక్యమునకు వ్యతిరేకముగా యున్నది.

6. శరీరముతో మరియ ఆరోహణమగుట (The Bodily Assumption of Mary) : మరియ యొక్క శరీరము నేరుగా పరలోకమునకు తీసికొని పోబడెనని దానికి కుళ్లు పట్టబడనియ్య లేదని 1950వ సంవత్సరములో కేథలిక్కు సంఘము ఒక సిద్ధాంతమును ప్రకటించెను. మరియను మానవత్వముగల దానిగా యుండనిస్తే ఆమె శరీరము మన్నై పోవును (ప్రసంగి 12:7). గనుక కేథలిక్కు సంఘము మరియను దేవత్వము గలదానిగా చేయుటకు ఈ సిద్ధాంతమును ప్రవేశపెట్టెను. ఈ సిద్ధాంతమును గూర్చిన ఋజువు బైబిలులో ఇసుమంతయును లేదు. మరియ మృతిబొందిన అనేక శతాబ్దముల వరకు కేథలిక్కులలో ఈనమ్మిక ప్రబలి యుండలేదు.

7. అద్భుతములు (Miracles): మరియద్వారా అనేక అద్భుతములు జరుగుచున్నవని కేథలిక్కులు రకరకాలుగా చెప్పుచుందురు. మరియ అద్భుతరీతిని వారికి కనబడెనని అనేకులు చెప్పుచుందురు. ఈ అద్భుత సంబంధ ఆరోపణలన్నియు ఆధునిక పెంతెకోస్తువారి ఆరోపణలవలెనే యుండును. అవన్నియును బైబిలులో వాగ్దానము చేయబడని కనబడని భ్రమలు మాత్రమే.

యేసుక్రీస్తు, అపొస్తలులు బోధించిన బోధనే ఈనాడు క్రైస్తవులుకూడ బోధించవలెను (గలతీ 1:8, 9). మరియనుగూర్చి ఈరకరకాల పారంపర్యములు ఆరంభించబడకముందే మనము నడచుకొనవలసిన విశ్వాసమార్గము బయలుపరచబడి స్థిరపరచబడెను(యూదా 3; ప్రకటన 22:18,19). మరియనుగూర్చిన ఈసిద్ధాంతములు దేవునిచే నియమింప

బడినయెడల యేసుగాని, పౌలుగాని, పేతురుగాని వాటినిగూర్చి ఎందుకు చెప్పలేదు ?

"మనుష్యులు కల్పించిన పద్ధతులు దైవోపదేశములని బోధించుచు వారు నన్ను వ్యర్థముగా ఆరాధించుచున్నారు" అని యేసు చెప్పెను (మత్తయి 15:9). దేవుడు తనకు తానే వ్యతిరేకముగా ప్రవర్తింపడు. ఆయన వాక్యమునకు వ్యతిరేకముగా మరియనుగూర్చియున్న ఈసిద్ధాంతములన్నియు మానవకల్పితములే.

—ఆవెన్ కాస్‌గ్రోవ్.

## సిలువపైనున్న దొంగ
## *(The Thief on the Cross)*

యేసుతోకూడ సిలువ వేయబడిన దొంగలలో ఒకనితో "నేడు నీవు నాతోకూడ పరదైసులోఉందువని నిశ్చయముగా నీతో చెప్పుచున్నాను" అని ఆయన అనెను (లూకా 23:43). ఆయనతో కూడ ఇద్దరుదొంగలు సిలువ వేయబడిరి; గాని ప్రభువునుండి ఒక్కడే ఈ వాగ్దానమును పొందెను. ఒకడు రక్షింపబడాలంటే ప్రభువుకు లోబడ నవసరంలేదని నిరూపించుటకొరకు కొందరు ఇతని సందర్భమును చెప్పుదురు. అట్టివారు ప్రభువునకు లోబడుటకు ఇష్టపడరు. మానవుడు రక్షింపబడాలంటే బాప్తిస్మమునుగూర్చిన ఆజ్ఞకు లోబడకుండగనే రక్షింపబడగలడని కొందరు బోధకులు బోధించుచున్నారు. వారి బోధను నిరూపించుటకు సిలువపై నున్న దొంగను ఒక ఉదాహరణగా చూపింతురు.

ఈవిషయములో దేవుని చిత్తాన్ని తెలిసికొనగోరువారి కొరకు ఇక్కడ సిలువపైనున్న దొంగనుగూర్చిన కొన్ని విషయములను గమనించుట అవుసరము. మొదటిగా ఈ దొంగ మోషే ధర్మ

శాస్త్రముక్రింద జీవించి అది ఇంకను అమలులో నున్నప్పుడు ఈ వాగ్దానమును పొందెను. యేసు చనిపోవువరకు మోషే ధర్మశాస్త్రము అమలులో యుండెను (కొలస్స 2:14). రెండవదిగా తండ్రియొక్కయు, కుమారుని యొక్కయు, పరిశుద్ధాత్మని యొక్కయు నామము లోనికి బాప్తిస్మమియ్యుడి అను నాజ్ఞ 43 రోజుల తరువాతగాని యేసు ఇయ్యలేదు. మూడవదిగా ఆదొంగ క్రీస్తురాజ్యములోలేడు. 50 రోజుల తరువాతగాని అది ఆరంభించబడలేదు. నాలుగవదిగా ఆ దొంగ క్రీస్తునందు లేడు. రక్షణ క్రీస్తులో యున్నదని పౌలుచెప్పెను (2 తిమొ. 2:13). అయిదవదిగా భూమిమీద పాపములను క్షమించే అధికారమును క్రీస్తు కలిగి యుండెను (మార్కు 9:6). ఆనాడాయన భూమిమీద ఉండెను గాని ఈనాడు లేడు.

ఆదొంగ ప్రభువునుండి వాగ్దానముపొందిన 43 రోజుల తరువాత యేసు "మీరు సర్వలోకమునకు వెళ్ళి సర్వసృష్టికి సువార్తను ప్రకటించుడి; నమ్మి బాప్తిస్మము పొందినవాడు రక్షించబడును, నమ్మనివానికి శిక్ష విధింపబడును" అని చెప్పెను (మార్కు 16:15, 16). అప్పటికింకా ఈ యాజ్ఞ యియ్యబడలేదు గనుక ఆ దొంగ దీనికి లోబడలేక పోయెను. అయితే దీనికి ఈరోజున మనము విధేయులము కావలెను, సరిగదా రక్షింపబడవలెనంటే దీనికి తప్పక లోబడవలెను. ఈ ఆజ్ఞ ఈయబడకముందు జీవించిన వానిని ఉదాహరణగా తీసికొని మనముకూడా దానికి లోబడ నక్కరలేదని చెప్పుట సమంజసముగా యున్నదా?

బాప్తిస్మమును గూర్చిన ఆజ్ఞను బోధించుటకు ఇష్టపడని బోధకులు "బాప్తిస్మము అవుసరమయితే బాప్తిస్మము పొందనివాడు శిక్షింపబడునని యేసుక్రీస్తు ఎందుకు చెప్పలేదు?" అని ప్రశ్నింతురు. అయితే "విశ్వసింపనివాడు దేవుని అద్వితీయ కుమారుని నామమందు

విశ్వాస ముంచలేదు గనుక వానికి ఇంతకుముందే తీర్పు తీర్చబడెను" అని యేసు ముందుగనే పలికెను (యోహాను 3:18). బాప్తిస్మము ప్రభువు చెప్పిన ఒక షరతు. దానిని నిరాకరించువాడు విశ్వసించని వాడు. అట్టివానికి ఇంతకుముందే తీర్పు తీర్చబడెను అని ప్రభువు చెప్పెను.

దేవుని లేఖనములను ఒకదాని కొకటి వ్యతిరేకముగా యుండు నట్లు ఉపయోగించువాని యెడల నీవు ఎట్టి గౌరవమును కలిగియుం దువు? క్రీస్తు చనిపోయిన తరువాత బైబిలులో మార్పు జెందినవారి సందర్భములన్నియు అపొస్తలుల కార్యముల గ్రంథములో యున్నవి. వారిలో ప్రతివాడును బాప్తిస్మము పొందిరి. క్రీస్తు చనిపోయిన తరు వాత బాప్తిస్మము పొందినవారి ఉదాహరణలను మానివేసి క్రీస్తు చనిపోకముందు సిలువపై నున్న దొంగ ఉదాహరణను మాత్రమే ఎందుకు తీసికొనవలెను? ఒకని పాపములు క్రీస్తునందు మాత్రమే ఈనాడు క్షమించబడును (ఎఫెసీ 1:7). ఒకడు బాప్తిస్మముద్వారా మాత్రమే క్రీస్తులోనికి ప్రవేశింపగలడు (గలతీ 3:27; రోమా 6:3). దేవుని వాగ్దానము లన్నియు క్రీస్తులోనే ఈనాడున్నవి (2 కొరింథీ 1:20). క్రీస్తుకు వెలుపల ఉండి ఎవడును ఆ వాగ్దానములను పొందలేడు.

—S. C. కన్నింగమ్.

---

## నీవుమాత్రమే దీనిని చేయగలవు

## *(Something only you can do)*

ఒక మనుష్యుడు తన కుక్కను కోపావేశముతో ఒకరాయి తీసుకొని కొట్టాడు. అప్పుడు ఆకుక్క కాలికి బలమైన దెబ్బతగిలింది. ఆపెంపుడు జంతువు విరిగిన కాలితో మూల్గుచు కుంటుకుంటూ తన

యజమాని యొద్దకువచ్చి అతని పాదములదగ్గరపడి, రాయి విసిరిన చేతిని నాకింది. ఆకుక్కలోయున్న క్షమాపణతత్వమునుబట్టి క్రైస్తవ ప్రేమలో మన మొక పాఠమును నేర్చుకోగలము.

ధర్మార్థమైన క్రైస్తవకార్యములను చేయుటలో నీవు నిర్లక్ష్యము చేయవచ్చు అవి యెవరో ఒకరు చేస్తారు. గాని నీశత్రువును నీవు క్షమించగలవు! నీవు యితరులను క్షమించుటకు తిరస్కరించిన యెడల నీవు దాటివెళ్ళవలసిన వంతెనను నీవు నాశనము చేసుకొన్నట్లే (మత్తయి 6:14).

యేసు తన శిష్యులకు ప్రార్థించుమని బోధించెను. "మా ఋణస్థులను మేము క్షమించియున్న ప్రకారము మా ఋణములు క్షమించుము" (మత్తయి 6:12). ఈవాక్యార్థమేమంటే: "మాకు వ్యతిరేకముగా పాపము చేసినవారిని మేము క్షమించియున్న ప్రకారము మా పాపములను క్షమించుము."

"సంకుచిత స్వభావులు, దౌష్ట్యమనస్కులు క్రోధముతోను, కక్షతోను నిండుకొనియుందురు. అట్టివారు శత్రువులను క్షమించుటలో గల ఆనందమును అనుభవించ లేని అసమర్థులు" అని లార్డ్ చెస్టర్ ఫీల్డ్ చెప్పాడు.

"హాని చేయుటవలన నీశత్రువుకంటె నీచుడవగుదువు. పగ తీర్చుటవలన వానితో సమానుడవగుదువు" అని బెంజమిన్ ఫ్రేంక్లిన్ చెప్పాడు. "ఆయన దూషింపబడియు బదులు దూషింపలేదు." గనుక క్రీస్తును పోలినవారై ఆయనను ప్రతిఫలింపజేయుడి (I పేతురు 2:23).

నిజమైన క్షమాపణ రద్దుచేయబడిన ఋణపత్రమువలె నుండవలెను. అది మరెన్నడును ఋజువుగా నుండకుండు నిమిత్తము చిన్న చిన్నముక్కలుగా చించి బూడిద యగునట్లు కాల్చివేసి, గాలిలో నలుదూలలకు ఎగురవేయుము. — J. R. బార్నెట్

# పరస్పర బాధ్యతలు

## *(Reciprocal Responsibilities)*

1. ఒకని నొకడు ప్రేమించుడి. యోహాను 13:34; I పేతురు 1:22; I థెస్స 3:12
2. ఒకనికొకడు బుద్ధి చెప్పుకొనుడి. రోమా 15:14; హెబ్రీ 3:14; కొలస్స 3:16
3. ఒకరితో ఒకరు సమాధానముగా ఉండుడి. మార్కు 9:50
4. ఘనత విషయములో ఒకని నొకడు గొప్పగా ఎంచుకొనుడి. రోమా 12:10; యోహాను 5:44
5. ఒకనితో నొకడు మనస్సు కలిసియుండుడి. రోమా 12:16, 15:5; I కొరింథీ 12:25
6. ఒకనియందొకడు అనురాగము గలవారై యుండుడి. రోమా 12:10
7. పరస్పర క్షేమాభివృద్ధి కలుగజేసుకొనుడి. రోమా 14:19
8. ఒకని కొకడు దాసులై యుండుడి. గలతీ 5:13
9. ఒకని భారముల నొకడు భరించుడి. గలతీ 6:2
10. ఒకరి నొకరు క్షమించుడి. ఎఫెసీ 4:32; కొలస్స 3:13
11. ఒకని మీద ఒకడు సణుగకుడి. యాకోబు 5:9
12. ఒకని కొకడు లోబడియుండుడి. ఎఫెసీ 5:21 I పేతురు 5:5
13. ఒకనితో ఒకడు అబద్ధమాడకుడి. కొలస్స 3:9
14. ఒకని నొకడు సత్కార్యములు చేయుటకు పురికొల్పు కొనుడి. హెబ్రీ 10:25
15. ఒకని నొకడు ఆదరించుడి. 1 థెస్స 4:18
16. ఒకని నొకడు హెచ్చరించుకొనుడి. హెబ్రీ 10:24
17. ఒకనితో నొకడు మీ పాపముల నొప్పుకొనుడి. యాకోబు 5:16

18. ఒకని కొకడు ఆతిథ్యము చేయుడి. 1 పేతురు 4:9

19. ఒకనితో ఒకడు సహవాసము కలిగియుండుడి.
1 యోహాను 1:7

20. ఒకరి సుఖదుఃఖముల యందు ఒకరు పాలుపొందుడి.
1 పేతురు 3:8

21. ఒకని నొకడు చేర్చుకొనుడి. రోమా 15:7

22. ఒకడు సత్యము నుండి తొలగి పోయినప్పుడు మరియొకడు అతనిని సత్యమునకు మళ్ళించుడి. యాకోబు 5:19

23. ఒకని నొకడు సన్మానించుకొనుడి. 1 పేతురు 2:17

24. ఒకని కొరకు ఒకడు ప్రార్థన చేయుడి. యాకోబు 5:16

25. ఒకని కొకడు వందనములు చేయుడి. రోమా 16:16.

సేకరణ : ప్రభుదాస్ సబ్బతి.

---

## క్రీస్తునందున్న దీవెనలు

### *( Blessings in Christ )*

మానవుల నందరిని ఏదో ఒక రీతిగ దేవుడు దీవించుచునే యున్నాడు. గాలి, నీరు, ఆహారము, వస్త్రములు మొదలగు వందల కొలది అవుసరములను ఆయన మానవుల కనుగ్రహించుచున్నాడు. భక్తుడైన యాకోబు బైబిలునందు ఇట్లనుచున్నాడు : "శ్రేష్ఠమైన ప్రతి యీవియు సంపూర్ణమైన ప్రతి వరమును పరసంబంధమైనదై, జ్యోతిర్మయుడగు తండ్రి యొద్ద నుండి వచ్చును; ఆయనయందు ఏ చంచలత్వమైనను గమనాగమనముల వలన కలుగు ఏ ఛాయయైనను లేదు" (యాకోబు 1:17). "దేవుడు చెడ్డవారిమీదను, మంచివారి

మీాదను తన సూర్యుని ఉదయింపజేసి, నీతిమంతులమీాదను అనీతిమంతులమీాదను వర్షము కురిపించుచున్నాడు" అని క్రీస్తు పునరుద్ఘాటించెను (మత్తయి 5:45).

మరికొన్ని దీవెనలు దేవునికి లోబడువారికి మాత్రమే ప్రత్యేకముగా యుంచబడినవి. ఇవి ఆత్మీయ దీవెనలు, అవి క్రీస్తునందు మాత్రమే దొరుకును. "మన ప్రభువైన యేసుక్రీస్తు యొక్క తండ్రియగు దేవుడు స్తుతింపబడునుగాక. ఆయన క్రీస్తునందు పరలోకవిషయములో ఆత్మసంబంధమైన ప్రతి ఆశీర్వాదమును మన కనుగ్రహించెను" అని అపొ. పౌలు వ్రాసెను (ఎఫెసీ 1:3).

ఈ ఆశీర్వాదములు క్రీస్తులోనే, కేవలము క్రీస్తులోనే దొరుకుచున్న యెడల, ఒకడు క్రీస్తునందు ప్రవేశించుట యెట్లు? అనే ప్రశ్న ఉద్భవించును. లేఖనములలో రెండు వచనములు దీనికి జవాబిచ్చుచున్నవి. మొదటిది రోమా 6:3 : "క్రీస్తు యేసులోనికి బాప్తిస్మము పొందిన మనమందరము ఆయన మరణములోనికి బాప్తిస్మము పొందితిమని మీారెరుగరా?" రెండవది గలతీ 3:26, 27 : "యేసు క్రీస్తునందు మీారందరు విశ్వాసమువలన దేవుని కుమారులై యున్నారు. క్రీస్తులోనికి బాప్తిస్మము పొందిన మీారందరు క్రీస్తును ధరించుకొని యున్నారు".

దీనినిబట్టి ఒకడు దేవునికి విధేయుడైనప్పుడు సమస్త ఆత్మీయాశీర్వాదములు కలిగియున్న క్రీస్తులో ప్రవేశించునని మనము గ్రహించుకొనగలము. క్రీస్తులోనికి ప్రవేశించకుండ ఒకడు దేవునికి విధేయుడు కాజాలడు. బాప్తిస్మము లేకుండ ఎవడు క్రీస్తులో ప్రవేశింపజాలడు. ఈ యాశీర్వాదములను పొందు మార్గము ఇది ఒకే ఒక్కటి మాత్రమే. 'క్రీస్తునందు' అను పదము ఒకడు ప్రవేశించు పరిస్థితిని సూచించుచున్నది. ఇది రక్షించబడిన స్థితి, క్రీస్తు యొక్క ఆత్మీయ శరీరమగు సంఘములో యున్న స్థితి (2 కొరింథీ 5:17; కొలస్స 1:18; ఎఫెసి 1:22, 23).

దేవుడు తన ప్రజలకు దాచియుంచిన దీవెనలన్నియు ఇక్కడ దొరుకును. అవి క్రీస్తులోనేగాని ఆయనకు వెలుపలలేవు. దేవునికింకను లోబడనివారు వాటిని పొందజాలరు. వారు పొందగలిగిన యెడల ఆయనకు విధేయత చూపించవలసిన కారణమేలేదు. అయితే సాధారణముగా మనుష్యులు ఈలోకములో పొందు దీవెనలకన్న దేవుడు తన ప్రజలను ఎక్కువ దీవించెదనని వాగ్దానము చేసెను. అయితే క్రీస్తునందున్న కొన్ని ఈ ఆత్మీయాశీర్వాదములేవి?

1. క్రీస్తునందు క్షమాపణ: "దేవుని కృపా మహదైశ్వర్యము నుబట్టి ఆ ప్రియునియందు ఆయన రక్తమువలన మనకు విమోచనము, అనగా మన అపరాధములకు క్షమాపణ మనకు కలిగియున్నది" (ఎఫెసీ 1:7).

2. క్రీస్తునందు పరిశుద్ధాత్మ యను వరము: "మీరు మారుమనస్సు పొంది పాపక్షమాపణ నిమిత్తము ప్రతివాడు యేసుక్రీస్తు నామమున బాప్తిస్మము పొందుడి; అప్పుడు మీరు పరిశుద్ధాత్మ అను వరమును పొందుదురు" (అపొ. కా. 2:38).

3. క్రీస్తునందు సజీవులుగా చేయబడుట: "ఆదామునందు అందరు ఏలాగు మృతి పొందుచున్నారో, ఆలాగుననే క్రీస్తునందు అందరు బ్రదికింపబడుదురు" (1 కొరింథీ 15:22).

4. క్రీస్తునందు నూతన సృష్టియగుట: "కాగా ఎవడైనను క్రీస్తునందున్న యెడల వాడు నూతన సృష్టి; పాతవి గతించెను, ఇదిగో క్రొత్తవాయెను" (2 కొరింథీ 5:17).

5. క్రీస్తునందు అందరు సమానులే: "ఇందులో యూదుడని గ్రీసుదేశస్థుడని లేదు, దాసుడని స్వతంత్రుడని లేదు, పురుషుడని స్త్రీ అని లేదు, యేసుక్రీస్తునందు మీరందరు ఏకముగా ఉన్నారు" గలతీ 3 : 28).

6. ప్రార్థించు తరుణము క్రీస్తునందున్నది: "దేవుడు పాపుల మనవి ఆలకింపడని యెరుగుదుము; ఎవడైనను దైవభక్తుడై యుండి ఆయన చిత్తము చొప్పున జరిగించిన యెడల ఆయన వాని మనవి ఆలకించును" (యోహాను 9:31).

7. క్రీస్తునందున్న వారితో ఆయన సదాకాలము ఉండుననని వాగ్దానము చేసెను: "ఇదిగో నేను యుగ సమాప్తివరకు సదాకాలము మీతోకూడ ఉన్నానని వారితో చెప్పెను" (మత్తయి 28:20).

8. క్రీస్తునందు నిరీక్షణ యున్నది: "మీ ప్రయాసమును మన ప్రభువైన యేసుక్రీస్తునందలి నిరీక్షణతో కూడిన మీ ఓర్పును, మేము మన తండ్రియైన దేవుని యెదుట మానక జ్ఞాపకము చేసికొనుచున్నాము'' (1 థెస్స 1:3).

ప్రభువుతో కలిగిన నూతన సంబంధములో మనకు లభించు ఆశీర్వాదములలో ఇవి కొన్ని మాత్రమే. నీవు క్రైస్తవుడవు కాని యెడల నీవేమి పోగొట్టుకొనుచున్నావో నీకు తెలియదు. క్రైస్తవునికి భౌతిక ఆశీర్వాదములే గాకుండ ఆత్మీయాశీర్వాదము లన్నియు లభించును. క్రీస్తునందు అతడున్నాడు. వాటితో అతడు భాగ్యవంతుడు. నీవు దేవునికి లోబడి అట్టి యాశీర్వాదము లన్నియు దొరుకు క్రీస్తులో ప్రవేశించిన యెడల వాటిని నీవుకూడ పొందగలవు (మార్కు 16:16, అపొ: కా. 2:47; ఎఫెసీ 1:22, 23; ఎఫెసీ 1:3). —జె. సి. ఛోట్.

---

*From*
**SATYA WAKKU**
P.O. Box 80
KAKINADA-533 001

**BOOK-POST**
Printed Book only

To
..............................
..............................
..............................